# అవ్యక్తం

రమ ఇంటర్ ఫేలయింది. తండ్రి విశ్వనాథం కాస్త బాధపడినా, తల్లి విశాలాక్షి పడినంత బాధపడలేదనే అందరికీ అనిపించింది. ఆడపిల్లలకి, ఈ చదువులు, పరీక్షలు ప్యాసవడాలు, పోవడాలు ఎంతకాలంలే అనుకుంటున్నాడని అతని నిర్లిప్తత వల్ల అందరికీ తెలిసింది. కానీ విశాలాక్షి అలాకాదు. రమ మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ రోజుల్లో ఆడపిల్లకి చదువు లేకపోవడం వల్లనే తను దమ్మిడీకి కొరగాకుండాపోయాననీ తరచూ బహిరంగంగానే బాధపడుతూ వుంటుంది. అందుకే రమ పరీక్ష పోవడం ఆ తల్లికి పెద్ద దెబ్బయింది.

ఇక్కడ మరో విషయం కూడా వుంది. పరీక్ష తప్పేటంత తెలివి తక్కువ పిల్లకాదు రమ. క్లాసులో ఫస్టుగా ఆమె వుండకపోయినా అన్నింటిలోనూ మంచి మార్కులు తెచ్చుకుంటూనే వుండేది. ఇంట్లో ఎప్పుడూ చదువుకుంటూ శ్రద్ధగా వుండేది. అలాంటి అమ్మాయి ఏకంగా పరీక్షలో ఫేలయిపోయిందంటే చాలామంది ఆశ్చర్యపోయారు. కొందరైతే ఏదో మోసం జరిగిందనీ, బోర్డుకి రాయమనీ సలహా యిచ్చారు. కానీ రమకి తెలుసు, తను లెక్కల పేపరు అస్సలు బాగా చెయ్యలేకపోయిందని – అన్నీ తెలిసిన లెక్కలు వచ్చినా ఆ సమయంలో బాగా చెయ్యలేకపోయింది. పరీక్ష రాసినంతసేపూ ఏదో అసౌకర్యంగా, ఇబ్బందిగా అనిపించి, చాలా ముందుగా పేపరిచ్చి వచ్చేసింది. తండ్రి, ఆమె ఎందువల్ల ఫేలయిందనే సంగతి పట్టించుకోనేలేదు. తనెందుకు పరీక్ష బాగా రాయలేకపోయిందో రమకి మాత్రమే తెలుసు.

విశాలాక్షి మాత్రం కూతుర్ని క్షమించలేకపోయింది. "మొదటిసారి పాసవ్వడమే అవ్వడం – డింకీలు కొడుతూ ప్రతిక్లాసూ రెండేసేళ్ళు చదవడానికి మనమే లక్షాధికారులం కాదు" అంటూ అక్కసూ, ఆవేదనా వెళ్ళగక్కింది. తల్లి మాటలకి ఎంతో ఏడ్చింది రమ.

కానీ ఏం చెయ్యగలదు? పోయిన పరీక్ష తిరిగి రాదు. గడిచిన కాలమూ రాదు. తన మీద అమ్మానాన్నలకు పోయిన నమ్మకమూ తిరిగిరాదు.

తెలిసీతెలియని వయస్సులో, అందీ అందని ఆలోచనలలో రమ ఎక్కువగా ఏమీ అనుకోలేకపోయింది - నిజానికి మళ్ళీ పుస్తకాలన్నీ ముందేసుకుని కూర్చోవాలంటే ఏడుపొస్తోంది.

ఆ రాత్రి అమతో నాన్న నెమ్మదిగా చెప్తున్న మాటలు విని అయోమయంలో పడిపోయింది.

"దానికోసం ఏభైవేలు పెట్టానుకదా! అవి మేలో మెచ్యూరవుతాయి. దాని మీదొచ్చే వడ్డీకి మరో పాతికవేలు సొసైటీ లోను పెడ్తా. పెళ్ళి చేసేద్దాం. అన్న వస్త్రాలకి లోటులేని ఉద్యోగస్తుడ్ని తీసుకొస్తే సరి" -

"ఇంటర్ ప్యాసయితే బి.ఏ.లో చేర్పించి, అదయినాక చేద్దామనుకున్నా -, అయినా ఏమంత వయసు మించిపోయిందనీ - దానదృష్టం అలాగయిందిగానీ" -

"నిజమే, నేనూ అలాగే అనుకున్నా-, కానీ ఏం చేస్తాం? ఇలా పరీక్షలు తప్పుతుంటే మనవల్ల కాదు. ఇంకా వైశాలి వుంది. దాని చదువెలా వుంటుందో" - తండ్రి కాస్త ఒప్పిస్తున్న ధోరణిలో మాట్లాడుతున్నాడు.

గుళ్ళో దర్శనం చేసుకుని, సిందూరం పెట్టుకుని దూరంగా మండపం దగ్గరకెళ్ళి కూర్చుంది రమ. అప్పుడప్పుడు చిరాకుగా వున్నప్పుడు ఆంజనేయస్వామి గుడికి వస్తూ వుంటుంది. అలాగే ఈరోజూ వచ్చింది. అప్పుడు కనిపించాడా వ్యక్తి. తను లెక్కల పేపరు రాసే రోజున వాచర్‌గా వచ్చిన జూనియర్ కాలేజి లెక్చరర్-, అతన్ని చూడగానే ఎక్కడలేని కోపం, అసహ్యం కలిగాయి రమకి. వాటి వెంటనే ఎంతో దుఃఖం పొంగుకొచ్చింది. వాడు దేవుడి గుళ్ళోకెళ్ళి గంటకొట్టి దణ్ణం పెట్టుకుని కళ్ళు మూసుకొని భక్తి ప్రదర్శించి మరోవైపుకెళ్ళిపోయాడు. రమ నెమ్మదిగా స్థంబం వెనక్కి జరిగి ముఖం మరోవైపుకి తిప్పుకుంది. ఈ వెధవ, వాచర్ కాకుండా మరెవరైనా అయితే తను పరీక్ష బాగా రాసేది. పాసయ్యేది. అంటే, కాపీ కొట్టేదా. ఛా - ఛా - అదేంకాదు. పోనీ తెలియనివి వాచర్ని అడిగేదా! ఛీ - అదీకాదు - మరేమిటి? ఏమో! తనకొచ్చింది నిశ్చింతగా రాసేదేమో.

ఎవ్వరూ ఊహించని విధంగా రమకి పెళ్ళి కుదిరిపోయింది. విశ్వనాధం ఆనందపడిపోయాడు. ఊరికే యాధాలాపంగా ప్రయత్నించాడు. కుదిరిపోయింది. పిల్లాడు ఎల్.ఐ.సి.లో వుద్యోగం చేస్తున్నాడు. తల్లీతండ్రీ లేరు. ఒక్కడే -, పెదనాన్న పెంచాడు. పెదనాన్న, పెద్దమ్మ ఇద్దరిదీ పెత్తనం. వాళ్ళకి పిల్ల నచ్చింది. ఆ అబ్బాయి అసలు కట్నం కూడా వద్దన్నాడు. కానీ పెద్దమ్మ పట్టుబట్టింది. విశ్వనాధం ఎలాగూ ఇద్దామనుకుంటున్నానని ఏభైవేలు యవ్వజూపాడు. వాళ్ళేం బేరాలు చెయ్యలేదు. అంతా కుదిరిపోయింది.

రమ పెద్దచదువులు చదవలేదనే బెంగ విశాలక్షిలో నిలవలేదు. ఆడపిల్లకి పెళ్ళి కుదరడం ఎంత కష్టంగా వుందో ఆమె చూస్తూనే వుంది. పైగా అత్త పోరు లేదు. ఆడబిడ్డల గోల లేదు.

రమ అయోమయంలో పడిపోయింది. వద్దు అని మొరాయించేందుకు ధైర్యం చాల్లేదు. కానీ వెంటనే పెళ్ళి చేసుకోవాలనీ లేదు.

"నాన్నా చదువుకుంటాను" అంది భారంగా ఒక్క మాటలో.

"చదువుకుందువుగాని తల్లీ! అతను మంచివాడిలా వున్నాడు. అతన్నడిగి చదువుకుందువుగానీ"

తండ్రి మాటలకి ఒళ్ళు మండిపోయింది. కానీ ఏం చేయలేని స్థితిలో నోరు మూసుకుండిపోయింది.

ముక్కూ ముఖం తెలియని మనిషితో కాపురం – పైగా చదువు గురించి అడగడం... ప్చ్! ఒక్కక్షణం మనసంతా శూన్యంగా అయిపోయింది. అందులోంచి ఒకే ఒక్క కోరిక తలెత్తింది. "ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలి" – "ఏదైతే అదే అవుతుంది"

ఆరు నెలలు అలవోకగా గడిచిపోయాయి. రమ భరించలేని కష్టాలేం ఎదుర్కోవడం లేదు. ఉదయ్ భాస్కర్ మంచివాడే. భార్యను ప్రేమగానే చూస్తాడు. తగుమోతాదులో ఆధునిక భావాలు కలవాడేగానీ ఏ విషయాన్నీ లోతుగా ఆలోచించడం లాంటివేమీ చెయ్యడు. అతని భావాలు, సాధారణంగా లోకంలో వున్న ఆచార వ్యవహారాల చుట్టూనే తిరుగుతూ వుంటాయి. అసాధారణమైన విషయాలు ఆలోచించటం, పట్టించుకోవటం చెయ్యడు.

అతనితో కలిసి ఆర్నెల్లుగా బతుకుతున్నా తను చదువుకుంటానని ఒక్కసారి కూడా అడగడానికి సాహసించలేకపోయింది రమ. ఏదో బెరుకు – ఏదో భయం. అతను బాగా వున్నాడు. తనేదైనా అడిగితే ఆ ప్రేమాభిమానాలు పోతాయేమో! కానీ ఎందుచేత అతని దగ్గర తనకి స్వేచ్ఛ ఉన్నట్లుగా అనిపించదు? – రమ ఆలోచనలో పడిపోయేది.

మర్నాడు ఉదయ్ ఇంటికి వస్తూనే ముఖమంతా నవ్వు పులుముకుని "రేపు మా పెదనాన్న వస్తున్నారు. ఇక్కడేదో పని వుందిట" అన్నాడు.

ఆ మాట రమకేమంత ఆనందదాయకం కాకపోయినా తనూ సంతోషాన్ని ప్రకటించింది.

"ఏ రైలుకొస్తున్నారు" అంది.

"విశాఖలో – నేను స్టేషనుకెళ్ళి తీసుకొస్తా. ఇల్లు శుభ్రంగా సర్దు. వంట బాగా చెయ్యి" అన్నాడు.

రమ తలూపింది. మళ్ళీ అతనే "నువ్వు వంట ఎప్పుడూ బాగానే చేస్తావు" అని

కాస్సేపాగి "మా పెదనాన్నే నన్ను పెంచి, పెద్దచేసి చదివించాడు. ఆయనకి నేనంటే మహాయిష్టం, ప్రేమ" అన్నాడు.

ఆ మాటల్లో అతని ఉద్దేశం రమకి అర్థమైంది. ఆయన వున్నంతకాలం తను అణకువగా, ఆయన సంతోషపడేలా ప్రవర్తించి మెప్పు పొందాలి.

సీతారామయ్యని చూడగానే రమకి గుండె గుభిల్లుమంది. ఎందుకో తెలీకుండా భయమేసింది. ఆయన మాత్రం చనువుగానే మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

పెళ్ళిలో కనుచీకట్లో - నిద్రకళ్ళతో - కంగారులో చూసిన ఆయన ముఖం గుర్తులేదు. ఇప్పుడు చూస్తే మరీ పరాయివాడిలా అనిపించింది రమకి.

'ఏమ్మాయ్! బాగున్నావా? ఎలావుంది కొత్త కాపురం? పనిపాటలకి అలవాటుపడ్డావా' అంటూ చనువుగా భుజం తట్టి మరీ పలకరించేసరికి ముడుచుకుపోయింది.

'మా పెదనాన్నకి కొత్తాపాతా అనేది లేదు. అందర్నీ సొంత మనుషుల్లా పలకరించేస్తాడు' అన్నాడు ఉదయ్.

సీతారామయ్య ఈమధ్యనే రిటైరయిపోయాడు. అతనికి రావలసిన డబ్బుల వ్యవహారాలు చూసుకునేందుకు రాజధాని నగరం వచ్చాడు. పొద్దున్న తొమ్మిది గంటలకల్లా ఉదయ్ టిఫిను తినేసి అన్నం క్యారేజీలో సర్దుకుని వెళ్ళిపోతాడు. విశ్రాంతిగా నిద్రలేచి, స్నానపానాదులు ముగించుకుని, అన్నంతినేసి, పనిమీద బయటపడటం సీతారామయ్య ఉద్దేశం.

అతను ఎక్కడపడితే అక్కడాగిపోతూ, జారిపోయే పంచ ఎగలాగుకుంటూ, ప్రదర్శనలిచ్చుకుంటూ, ఎప్పుడూ బనీనైనా లేకుంటా ఇంట్లో కలియ తిరుగుతూ వుంటే రమకి కాస్తైనా మరుగు లేకుండాపోయింది. దానికితోడు అతని విచిత్ర చూపులు, మాటలు మరీ అయోమయంలో పడేస్తున్నాయామెని.

బయటికెళ్ళినవాడు యింట్లోకి వస్తూనే "అమ్మాయ్! పమిట సరిగ్గా వేసుకో" అని హెచ్చరించేవాడు. రమకి శరీరం చచ్చిపోయినట్లనిపించేది. తన పమిట తొలగడం, మామగారు గ్రహించి హెచ్చరించటం ఆమెకి సహించరానిదైంది.

కాఫీ కలుపుతుంటే భుజం మీంచి తలకాయ ముందుకుపెట్టి "ఎక్కువ మరగనీయకు" అనో -, బజారునుంచి తెచ్చిన కూరలు విడదీసుకుంటుంటే అలాకాదు, ఇలా విడదీయాలి అంటూ చేతులు, కాళ్ళూ తగిలిస్తూంటే ఏం తోచక బిత్తరపోయేది. మధ్యాహ్నం చాపేసుకుని కాస్సేపు నడుం వాలిస్తే తట్టిమరీ లేపుతూ 'ఏయ్ పిల్లా' అనో, 'ఏయ్ అమ్మాయ్' అనో పిలిచి "కాఫీ కలుపుదూ కాస్త-" అంటే ఆయన్ని విసుక్కోవాలో, విదిలించి కొట్టాలో అర్థంకాకుండాపోయేది రమకి. ఎదురుగా ఒళ్ళంతా సూదులు గుచ్చినట్లు చూస్తుంటే, నిలబడలేక బయటికి వెళ్ళేది. దొడ్లోకి పారిపోయేది. నాలుగు

రోజులు గడిచేసరికి రమకి కంపరమెత్తిపోయింది. బయటకెలా చెప్పాలో, ఏం చెప్పాలో అర్థంకాకుండా పోయింది.

ఆ రాత్రి సున్నితంగా ఉదయ్‌తో చెప్పడానికి ప్రయత్నించింది. అతను విషయం గ్రహిస్తూనే గయ్యిమన్నాడు – "నువ్వేమనుకుంటున్నావు మా పెదనాన్న గురించీ? పెద్దవాడు, సర్వీసు నుంచి రిటైరయినవాడు. ఆయన్ని పట్టుకుని యిష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావ్. అస్తమానూ మీరు ఆడవాళ్ళమనే విషయం మర్చిపోవాలి. మామూలుగా వుండాలి. ఆయన పెద్దవాడు. ఆయనకేం ఖర్మ? – ఛీ –, కూతురులాంటి దానవు. పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకు" అంటూ చీవాట్లతో దులిపేశాడు. రమ నోరెత్తలేకపోయింది. తన బాధ, ఇబ్బంది, ఎలా విడమర్చి చెప్పాలో ఆమెకి అర్థం కాలేదు. మౌనంగా వుండిపోయింది. చివరిగా ఉదయ్ "ఆయనేం ఎల్లకాలమూ ఇక్కడే వుండిపోడులే" అంటూ క్రూరంగా దెప్పివదిలాడు.

సీతారామయ్య ప్రవర్తనలో మార్పేమీ లేదు. ఆయన చూపులు శరీరంలో దూసుకుపోతుంటే తను లెక్కల పరీక్ష రోజు పేపరు రాయలేకపోవడం పదేపదే గుర్తుకొచ్చేది రమకి. నరకంలా పది రోజులు గడిచిపోయాయి. ఆరోజు సీతారామయ్య బండెక్కాడు. రమ గట్టిగా ఊపిరి పీల్చుకుంది. మళ్ళీ ఆ విషయం ఉదయ్ దగ్గర ఎత్తలేదు – 'పోనీలే గడిచిపోయింది కదా! మళ్ళీమళ్ళీ రాబోతాడా ఏం?' అనుకుని సరిపెట్టేసుకుంది.

ఆడపిల్ల జీవితమంటే ఏదో హైస్కూలు చదువు, ఆ తర్వాత కట్నం, పెళ్ళి, మగాడికి అణకువగా వుండటం, – అతను చెప్పినట్టు తు.చ. తప్పకుండా వినడం – ఇంట్లో పని చేసుకుపోవడం, – పిల్లల్ని కనడం, వాళ్ళని సాకడం, అలా అలా జీవితం వెళ్ళమార్చటమే ఆడపిల్లకున్న ప్రపంచమని తెలుసుగానీ, చదువు, విజ్ఞానం, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం, స్వేచ్ఛా, సొంత ఆలోచనా, సొంత నిర్ణయాలు లాంటివి రమకి బొత్తిగా తెలీకుండా పోయాయి.

వాళ్ళ పెదనాన్న గురించి తను మరోవిధంగా మాట్లాడిందని, ఉదయ్ పెద్దగా పట్టించుకోనేలేదు. ఆ మాటలు వారి మధ్య మళ్ళీ రాలేదు. వయసెక్కువ లేకపోయినా రమకి పెద్దరికపు ఆలోచనలే తరచూ వస్తున్నాయి. ఏముంది? పెళ్ళయిపోయింది. ఇక నేడో రేపో పిల్లలు పుడతారు. వాళ్ళని పెంచటం, లాలించటం, చదివించటం – కాలక్షేపం బాగానే వుంటుంది. ఇంతకంటే ఇంకేముంది?

"రమా! సంధ్య వస్తోంది" అన్నాడు ఉదయ్. రమకి చటుక్కున అర్థం కాలేదు. 'అంటే' అంది. "మా వరాలపిన్ని కూతురు. భలే ఉషారుగా వుంటుంది. అదీ నేనూ ఒకేరోజున పుట్టాం. నేను పొద్దున అయిదున్నరకి పుట్టాను. అది సాయంత్రం ఆరు గంటలకి పుట్టింది. అందుకే నా పేరు ఉదయ్ భాస్కర్. దానిపేరు సంధ్య అని పెట్టారు. నాకంటే పన్నెండున్నర గంటలు చిన్నది. మా అమ్మ నాకు ఏడో రోజునే పోయింది.

తర్వాత మా వరాల పిన్నే నన్ను పెంచుతానందట. కానీ మా పెదనాన్న యివ్వలేదుట" అన్నాడు.

మళ్ళీ పెదనాన్న మాట రాగానే రమకి చిత్రంగా గుండె దడదడలాడింది. వెంటనే సర్దుకుంది. ఒక మామగారి విజిట్ అయింది. ఇప్పుడొక ఆడపడుచు విజిట్ ఉంది. ఆమెలా వుంటుందో? ఎవరూ లేరంటారు గానీ ప్రతివాళ్ళకీ ఎవరో ఒకరు వుంటూనే వుంటారు.

సంధ్య వస్తూనే గలగలా మాట్లాడేస్తూ రమ చేతిలో పని అందుకుంది.

"నువ్వుండవే రమ చేస్తుంది" అని ఉదయ్ ఎన్నిసార్లు చెప్పినా వినలేదు.

"చాల్లేరా! రమ మనిద్దరికంటే అయిదేళ్ళు చిన్నపిల్ల. మనిద్దరం కూర్చుని ఆమె చేత పని చేయించటం చాలా అన్యాయం" అంటూ దబాయించి పారేసింది.

ఆమె వచ్చిన కాస్సేపటికే రమకి ఆత్మబంధువు వచ్చినట్లనిపించింది.

వేషభాషల వల్ల, చదువు సంధ్యల వల్ల, సమాజంలో తిరుగుతూ లోకజ్ఞానం సంపాదించడం వల్ల సంధ్య రమకంటె చిన్నదానిలా, చురుకుగా, చొరవగా తెలివిగా కనబడుతోంది. కొంచెం నలిగిన చీరతో మెళ్ళో నల్లపూసలు, చేతుల నిండా గాజులు, కాళ్ళకి పట్టాలు, మట్టెలు, ఏమరుపాటున కూడా బొట్టు మర్చిపోవడానికి వీలుపడని క్రమశిక్షణతో, ఆరిందగా, అణకువగా పెద్దరికం వహిస్తూ గృహిణి లక్షణాలు పుణికి పుచ్చుకుని కనిపిస్తోంది రమ.

"నువ్వు చేసింది నాకేం నచ్చలేదు – పదివేలు జీతం – ఒక్కసారిగా అలా వదిలేయడం – ప్చి – బాగాలేదు" అన్నాడు ఉదయ్.

"నువ్వు మాట్లాడకు. ఏ పరిస్థితుల్లో నేను చేశానో ఆలోచించు. అది చాలా దుర్భరం. అసలు మీ మగాళ్ళేమనుకుంటున్నారు? మీరే విధంగా హింసించినా చచ్చినట్టు పడివుంటారు, అనుకుంటున్నారా?" గయ్యిమంది సంధ్య.

"అదంతా తర్వాత, వాడెవడో ఏదో చేశాడని నిక్షేపం లాంటి ఉద్యోగం వదులుకోవడం అజ్ఞానం".

"కానీ ఏం చెయ్యను? నాకు మాత్రం సరదానా" నేనెంతో ఆసక్తితో, ఇష్టపడి తీసుకున్న ప్రాజెక్టు. మధ్యలో వదిలేయాల్సి వచ్చినందుకు ఎంత బాధపడుతున్నానో తెలుసా! కానీ అది భరించలేనిది".

"నీ పని నువ్వు చేసుకో" ఉదయ్ వాదన.

"నో, కుదరదు మొత్తం పనంతా ఇద్దరం కలిసి మాట్లాడుకుంటూ, డిస్కస్ చేసుకుంటూ చెయ్యాలి".

"మరైతే బయటపెట్టి పోరాడు" –

–"ఏమిటీ పోరాడేది? కనిపించేది కాదు. వివరించేది కాదు. ఎవరితో ఫిర్యాదు

చేసినా బాగుండదు".

"ఎందుకూ".

"చూచాయగా ఈ మాటలు మా బాస్‌తో చెప్తే ఏమన్నాడో తెలుసా. అస్తమానూ మీరు ఆడవాళ్ళం – ఆడవాళ్ళం అనే విషయం గుర్తు చేసుకుంటూ వుండటం మానాలి" అన్నాడు.

ఉదయ్ లోపలొక్కసారి ఉలిక్కిపడ్డాడు.

అంతవరకు ఇద్దరి మాటలూ వింటూ ఆశ్చర్యంగా చూస్తున్న రమ కళ్ళు మెరిశాయి. ఆమె లోలోపల మధనపడుతూ, బయటికి చెప్పలేక సతమతమవుతున్నదేదో వాళ్ళ సంభాషణలో ఆమెకి అర్థమవుతున్నట్లనిపించింది.

"అది కాకపోతే మరొక ఉద్యోగం అని నేననను. ఎందుకంటే ఉద్యోగం సంపాదించటం అంత సులువుగా ఏం లేదని నాకు తెలుసు. కానీ..." సంధ్య ఆగింది.

ఎవ్వరూ కొంతసేపు మాట్లాడలేదు. మళ్ళీ సంధ్యే అంది.

ఆడవాళ్ళు తమకి సంబంధం లేకుండా, తమ తప్పు లేకుండా ఎంతో నష్టపోతున్నారు. ఎంతో కెరీర్‌ని, సమయాన్ని పోగొట్టుకుంటున్నారు వారు నష్టపోతున్నదాన్ని ఎవరు భర్తీ చేయగలరు? ఆడవాళ్ళు వాళ్ళిలా కోల్పోయామని గ్రహించటానికే చాలా సమయం పట్టేస్తోంది. లైంగిక హింసకి గురవుతున్న ఆడవాళ్ళ పట్ల సాటి ఆడవాళ్ళకే సానుభూతి లేకపోవడం దురదృష్టం. మొన్నొకామె అంటోంది –

"ఏమో! నేనిన్నాళ్ళుగా మగవారితో పనిచేస్తున్నా నాకెప్పుడూ ఇలాంటి సమస్య రాలేదు" అంది భుజాలెగరేస్తూ –.

మరొకామె "ఆమెలో ఏదో వుంది. ఏదో సమ్‌థింగ్ – అందుకే మగవాళ్ళలా చూస్తారు" అని కళ్ళు గుండ్రంగా తిప్పుతూ తేల్చింది.

"సెక్సువల్ హెరాస్‌మెంట్ అంటే కేవలం మనిషిని తాకి బాధించటమే కాదని మగవారు గ్రహించినప్పుడే ఆడవాళ్ళకి కాస్త సుఖమైన జీవితం లభిస్తుందేమో" –

ఆమె మాటల్లో ఆశ వుంది. నిరాశ వుంది. ఆవేదన వుంది. ఆరాటం వుంది. ఈ పరిస్థితి నుంచి ఎలా బయటపడగలమా అనే ఆలోచన వుంది –, మగవారి ఆలోచన మార్చే ప్రయత్నం చేయగలమా అనే సంశయం వుంది. స్త్రీలను యిలా బాధించకూడదనే గ్రహింపు కలిగించటానికి మనమేం చేయగలం అనే ప్రశ్న వుంది.

కొద్ది నిముషాలు నిశ్శబ్దం అక్కడ పరచుకుని వుంది. ఉదయ్ నిద్రలోంచి మేల్కొన్నట్లుగా తల విదిలించాడు.

చెల్లెలు సంధ్య మరో ఉద్యోగం వెదుక్కునేందుకు సాయంగా నిలుస్తానన్నాడు ఉదయ్. రమ చదువు కొనసాగించేందుకు, ముందుగా ఇంటర్ పరీక్షకు వెళ్ళేందుకు అన్ని ఏర్పాట్లూ చేయడానికి సంధ్య కంకణం కట్టుకుంది.